

రోడ్డుపై పారుతున్న మురుగునీరు..!

కోటపల్లి: మండలంలోని సర్వాయిపేట గ్రామంలో డ్రెయినేజీలు కరువయ్యాయి. ఇళ్లలోని మురుగు నీరు సర్వాయిపేట, నాగంపేట వెళ్లే ప్రధాన రహదారిపై పారడంతో రోడ్డంతా బురదమయంగా మారుతోంది. దీంతో నాగంపేట, బొప్పారం గ్రామాల నుంచి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై బురద పేరుకుపోవడంతో వాహనాలు జారి పడిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు నిత్యం ఇదే దారి వెంట ప్రయాణం చేస్తూ.. గ్రామాలకు వెళ్తున్నారే తప్పా సమస్యను పరిష్కరించడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీలు నిర్మించి రోడ్డుపై మురుగునీరు పారకుండా, బురద పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా విద్యుత్‌లైన్‌

భీమారం: మండలంలోని దాంపూర్ గ్రామంలోని కొత్తగూడెం వద్ద ఇళ్లపై నుంచి విద్యుత్ లైన్ ఉండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. లైన్ తొలగించి దూరంగా వేయాలని కొన్నేళ్లుగా విద్యుత్‌శాఖ అధికారులను వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదవశాత్తు తీగలు తెగిపడితే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అధికారులు చర్యలు తీసుకొని ఇళ్లపై నుంచి ఉన్న విద్యుత్‌లైన్ మార్చాలని కోరుతున్నారు.



నల్లాలు నిరుపయోగం

చెన్నూర్‌రూరల్: మండలంలోని బుద్దారం ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు తాగునీరు, చేతులు కడుక్కునేందుకు నల్లాలు అమర్చారు. కానీ నీటి సదుపాయం కల్పించలేదు. పాఠశాల ఎదుట బోరు ఉన్నా, అది కూరుకుపోవడంతో ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయి. సంబంధిత అధికారులు పట్టించుకొని బోరుకు మరమ్మతు చేపట్టి నల్లాలకు నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



శ్మశానవాటిక అధ్వానం

చెన్నూర్‌రూరల్: మండలంలోని లంబడిపల్లి గ్రామంలో నిర్మించిన శ్మశానవాటిక చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో అధ్వానంగా మారింది. నీటి సౌకర్యం లేకపోవడంతో అంత్యక్రియల సమయంలో కుటుంబసభ్యులు, బంధువులకు స్నానమాచరించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని నీటి సౌకర్యం కల్పించాలని, శ్మశానవాటిక చుట్టూ పిచ్చి మొక్కలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



బ్లాక్‌స్పాట్‌లు పరిశీలిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ

మందమర్రిరూరల్: రోడ్డు ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పేర్కొన్నారు. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డితో కలిసి గురువారం జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్‌లను, గ్రిల్స్‌ను పరిశీలించారు. అవసరమైన చోట స్పీడ్‌బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని రహదారి అధికారులకు సూచించారు. మందమర్రి ఎస్సై రాజశేఖర్, రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

'మమత' ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



అర్పిత, హైమతో మమత సభ్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మహిళా తరంగిణి(మమత) ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని గురువారం జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయం సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి అర్పిత, షీటీం ఎస్సై వి.హైమలను ఘనంగా సన్మానించారు.

మందకృష్ణ చిత్ర పటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చెన్నూర్: ప్రభుత్వం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చకినారపు మల్లేశ్, నాయకులు తగరం శ్రీనివాస్, రసపాక మల్లేశ్, చకినారపు పున్నం, దుర్గప్రసాద్, తగరం చిరంజీవిలు పాల్గొన్నారు.

'ఉపాధి' డబ్బులు చెల్లించాలి



మాట్లాడుతున్న సీపీఎం శ్రేణులు

బెల్లంపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కూలీలకు వెంటనే కూలీ డబ్బులు చెల్లించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న చోటుకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం ఏరియా కార్యదర్శి అశోక్, శాఖకార్యదర్శి దేవదాస్, సీపీఎం శ్రేణులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

లక్సెట్టిపేట: మంచిర్యాల పట్టణంలోని చార్వాక ట్రస్ట్ వద్ద ఏప్రిల్ 3న తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి జిల్లా మూడో మహాసభ నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ జైపాల్‌సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీసీ రిజర్వేషన్లు హర్షణీయం

మంచిర్యాలటౌన్/దండేపల్లి/భీమారం/జైపూర్/లక్సెట్టిపేట: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు, బీసీ రిజర్వేషన్ 42శాతం బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదించినందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం టపాసులు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. తెలంగాణలో బీసీలకు 42శాతంకు రిజర్వేషన్లు పెంచడం హర్షణీయమని బీసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులకు రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ డబ్బులు ఇవ్వడంతో పాటు, అన్ని రకాల మేలు చేకూరుస్తున్నట్లు పేర్కొన్నారు. మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో, దండేపల్లి, భీమారం, జైపూర్, లక్సెట్టిపేట మండలాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డ వివేక్‌వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు.



దండేపల్లి: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



జిల్లా కేంద్రంలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



భీమారంలో...



లక్సెట్టిపేటలో...

ఆయిల్ పాం సాగుపై అవగాహన

భీమారం: ఆయిల్ పాం తోటల సాగుకు భూములు అనుకూలంగా ఉన్నాయని, తోట ల పెంపకంపై రైతులు ఆసక్తి చూపాలని ఏవో అత్తి సుధాకర్ తెలిపారు. మండలంలోని పోలంపల్లిలో గురువారం ఆయిల్ పాం తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాట్రిక్స్ ఆయిల్ పాం కంపెనీ మేనేజర్ మురళీకృష్ణ, ఏఈవో అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

కూరగాయల పంటలపై...

నెన్నెల: మండలంలో సాగు చేస్తున్న కూరగాయల తోటలను వ్యవసాయాధికారిణి పుష్పాల సృజన గురువారం పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. యాసంగిలో పంట మార్పిడిలో భాగంగా పప్పుదినుసులు, ఆయిల్‌పామ్, కూరగాయల సాగు చేసుకోవాలని సూచించారు. పంట కోసిన తర్వా త కొయ్యలు కాల్చొద్దన్నారు. కార్యక్రమంలో ఏఈ రాంచందర్, రైతులు పాల్గొన్నారు.



పుచ్చకాయ తోటను పరిశీలిస్తున్న సృజన

కోమటిచేనులో పంటల పరిశీలన

కాసిపేట: మండలంలోని కోమటిచేను శివారులోని పంటలను గురువారం మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ పరిశీలించారు. వరి, మొక్కజొన్న పంటల పరిస్థితిని రైతులకు వివరించారు. ప్రస్తుత దశలో ఎదురుకానున్న సమస్యలు, నివారణ మార్గాలను తెలియజేశారు.

సంక్షిప్త వార్తలు

● ప్రజావాణి దరఖాస్తుపై విచారణ

జన్నారం: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుకు అధికారులు స్పందించారు. ఈ నెల 17న సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రేండ్లగూడ గ్రామానికి చెందిన గడ్డి రాజు చేసిన దరఖాస్తు ప్రకారం రేండ్లగూడ శివారులోని సర్వే నంబర్ 32లో హద్దుల విషయంపై తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎస్సై రాజవర్ధన్, ఆర్ఐ భానుచందర్ మోకా మీదికి వెళ్లి హద్దులు పరిశీలించారు. రైతుతో మాట్లాడారు. సమస్య పరిష్కారం కావడానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

● ఇనుప స్తంభాలు మాయం

మందమర్రిరూరల్: మందమర్రి మండలం మామిడి గట్టు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలోని ఏడు ఇనుప స్తంభాలు మాయమయ్యాయి. స్థానికులు గుర్తించి గురువారం ఎంపీడీవోకు సమాచారం ఇవ్వగా, తీసుకెళ్లిన వారు కార్యాలయ ఆవరణలో వేయాలని రాత్రి డప్పు చాటింపు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

● 'గడువు దాటిన మందులు అమ్మొద్దు'

వేమనపల్లి: గడువు ముగిసిన పురుగు మందులు, కాలం చెల్లిన విత్తనాల ప్యాకెట్లను అమ్మొద్దని భీమిని డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు ఎల్తూరి సురేఖ అన్నారు. మండల కేంద్రంతో పాటు గొర్లపల్లిలో గురువారం ఫెర్టిలైజర్ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. మండల వ్యవసాయాధికారి వీరన్న, డీలర్లు పాల్గొన్నారు.

● వివాహిత అదృశ్యం

నెన్నెల: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన 22ఏళ్ల వివాహిత బుధవారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని ఎస్సై ప్రసాద్ తెలిపారు. బ్యాంకులో పని ఉందని నెన్నెలకు వెళ్తున్నానని చెప్పి, ఇంటి నుంచి బయలుదేరి ఎటో వెళ్లిపోయిందని చెప్పారు. భర్త కుటుంబ సభ్యులు తెలిసిన వారి ఇళ్లల్లో వెతికిన ఆచూకి లభించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

● తాగునీటి సమస్యకు పరిష్కారం

నెన్నెల: మండలంలోని గన్‌పూర్‌లో బోరు మోటారు చెడిపోగా గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్ గురువారం తన సొంత డబ్బులతో బోరు మోటారు బాగుచేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

● సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కాసిపేట: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పెద్దనపల్లి గ్రామపంచాయతీ న్యూ కాలనీలో గురువారం కళాబృందం నృత్య ప్రదర్శనలతో ప్రజలకు సైబర్ క్రైం, గంజాయి నియంత్రణ, మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు.

ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దు

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఆస్తి పన్నులు వసూలు చేయాలని మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ మూల రాజిరెడ్డి అన్నారు. రాత్రివేళల్లో ఆస్తి పన్నులు వసూలు చేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారనే విషయాన్ని తెలుసుకున్న ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి కమిషనర్ మురళీకృష్ణను కలిసి చెన్నూర్ ప్రాంత సమస్యలను వివరించారు. చెన్నూర్ ప్రాంతంలో అబాది భూములు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. అబాది భూములు రిజిస్ట్రేషన్ కావన్నారు. ఆ భూముల్లో నిరుపేదలు ఇండ్లు నిర్మించుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంత భూముల విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఇండ్ల నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సతీశ్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సుశీల్‌కుమార్, గన్‌శ్యామ్ ముందడా, మంగీలాల్ బజాజ్, ముత్యాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న రాజిరెడ్డి

దరఖాస్తుల ఆహ్వానం

చెన్నూర్: హైదరాబాద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ డిప్లొమా కోర్స్‌లో 2025–26 సంవత్సరానికి ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు విద్యాసాగర్ తెలిపారు. డిప్లొమాలో చేరేందుకు పది ఉత్తీర్ణత, 1 జూలై 2025 నాటికి 23సంవత్సరాలు వయస్సు కలిగి ఉండాలన్నారు. మూడు సంవత్సరాల పాటు ఆరు సెమిస్టర్లు ఉంటాయని, 60సీట్లు ఖాళీలున్నాయని తెలిపారు. అభ్యర్థులు ఏప్రిల్ మొదటి వారంలోగా హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. వివరాలకు 90300 79242 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నాసిరకం మెటీరియల్ సరఫరా

శ్రీరాంపూర్: భూగర్భగనుల్లో నాసిరకం మెటీరియల్ సరఫరా చేస్తున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు ఆరోపించారు. గురువారం ఆ యూనియన్ కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదాలు ఆర్కే 7 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులు వారి సమస్యలను తెలియజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. కార్మికులకు నాసిరకమైన హ్యాండ్ గ్లౌజ్‌లు ఇస్తున్నారని, లైన్మెన్ కార్మికులకు కీలలు సరిపడా సరఫరా చేయడం లేదని, పాత టబ్‌వీల్స్ రిపేర్ చేసి పంపించడంలో జాప్యం జరుగుతుందన్నారు. సరిపడా టబ్బులు సమకూర్చకపోవడంతో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం కలుగుతుందని వాపోయారు. షాంప్లింగ్ మజ్దూర్లకు సంబంధించిన స్టోర్ రూం రిపేరు చేయించాలని, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని, ఇంకా ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం గని అధికారులను కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్‌రావు, ఫిట్ కార్యదర్శి మారుపెల్లి సారయ్య, ట్రేడ్స్ మెన్ నాయకులు సురేష్, ఫిట్ సహాయ కార్యదర్శి సామిని సదానందం, నాయకులు రాజ్‌కుమార్, ఎంబడి తిరుపతి, నాగరాజు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

ఫెనాల్టీ క్లాజును రద్దు చేయాలి

శ్రీరాంపూర్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఫెనాల్టీ వేసే క్లాజును రద్దు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) నాయకులు కోరారు. ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శి వెంకన్నలు గురువారం కొత్తగూడెంలో డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్వీ సూర్యనారాయణను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లిఖార్జున్, సంజీవ్, రమేశ్, లింగయ్య, సంపత్, తిరుపతి పాల్గొన్నారు.



డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

క్వార్టర్లకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని అధికారులకు జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం క్వార్టర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. పలువురు అధికారులు క్వార్టర్లకు దరఖాస్తు చేసుకోగా సీనియారిటీ ఆధారంగా తొమ్మిది మందిని క్వార్టర్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్‌కుమార్, ఏజీఎం ఫైనాన్స్ భీబత్సా, డీవైపీఎం రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

లెక్కా పద్దులపై సమీక్ష

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా పరిదిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లెక్కా పద్దులపై అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం జరిగిన ఈ సమావేశంలో ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ మాట్లాడుతూ.. గనులు, డిపార్టుమెంట్లపై ఈ వార్షిక సంవత్సరం మార్చి 31నాటికి లెక్కా పద్దులు పూర్తి చేయాలన్నారు. బిల్లుల చెల్లింపులు, కమిషన్ రిపోర్ట్‌లు, పూర్తయిన కాంట్రాక్టర్ల పనుల పెర్ఫార్మెన్స్ రిపోర్టును మార్చి 31లోగా సమర్పించాల్సిందిగా అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఏజీఎంలు బీభత్సా, కుర్మ రాజేందర్, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు, డీజీఎంలు అరవింద రావు, ఆనంద్ కుమార్, ఏజెంట్‌లు శ్రీధర్ వెంకటేశ్వర్లు, మల్లయ్య, అకౌంట్ అధికారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

తాండూర్: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ తెలిపారు. బెల్లంపల్లి ఏరియా గోలేటి వర్క్‌షాప్‌లో గురువారం నిర్వహించిన బాయిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందస్తుగా వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న కార్మికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు, ఏరియా కార్యదర్శి చంద్రకుమార్, అసిస్టెంట్ ఫిట్‌సెక్రెటరీ యునూష్, నాయకులు పాల్గొన్నారు.

పరీక్ష రాయాలంటే పాట్లు పడాల్సిందే..!



తాండూర్: పనిచేయని ఫ్యాన్లు



ఆటోలో పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు(ఫైల్)

భీమిని/నెన్నెల: భీమిని, కన్నెపల్లి మండల కేంద్రాల్లోని ఉన్నత పాఠశాలల్లో, నెన్నెల మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రానికి చేరుకోవడానికి 'పది' విద్యార్థులు పాట్లు పడాల్సిందే. విద్యార్థులకు అనుకూలంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. కొన్నేళ్లుగా సుమారు 25కిలో మీటర్ల దూరం నుంచి ఆటోలు, టాటాఏసీల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తూ విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పరీక్ష వేళల్లో బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తాండూర్: మండల కేంద్రంలోని తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విద్యాభారతి ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 220 మంది విద్యార్థుల కోసం 9 గదులను గుర్తించారు. వీటిలో కొన్ని గదుల్లో ఫ్యాన్‌లు చెడిపోయి ఉన్నాయి. వాటర్ ప్యూరీఫైర్ మరమ్మతులకు రాగా మిషన్ భగీరథ మినరల్‌వాటర్ క్యాన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తఫ్యాన్‌లు తెప్పించామని పరీక్ష సమయానికల్లా ఫ్యాన్‌లు బిగించి, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎంఈవో మల్లేశం తెలిపారు.

కంటి ఆపరేషన్లు

చెన్నూర్: పట్టణంలోని బండారి రాజేశ్వరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెన్నూర్ మండలానికి చెందిన 20మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించినట్లు వైద్యులు అభిషేక్ చిందం తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ లక్ష్మణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.